


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

గోవింద్ గోపాల్‌కి ఇక్కడ ఏం జరుగుతోందో తెలీదు. ‘‘...ఇంతవరకూ బాగానే ఉన్నావ్‌గా. చివరలో లేచావేమిటి?’’ దూరంనుంచి వస్తూ అడిగాడు.

శవపేటికలోంచి అనూజ్ఞ బయటకు వస్తూ ‘‘...కళ్ళల్లో కారం కొడితే లేవక ఛస్తానా?’’ కరిచినట్లు అని, అదే కోపంలో కార్తికేయ వైపు చూస్తూ ‘‘అయినా ఇదేం ఆచారం? కళ్ళమీద కర్పూరం పెట్టటం అనేది ఎక్కడా లేదే’’ అంది...

‘‘కర్పూరం కాదు. మట్టి’’ పొట్లం చూపిస్తూ అన్నాడు కార్తికేయ. ‘‘...అనుమానం రాగానే పొట్లం కట్టాను.’’

‘‘ఇది పందెం తాలూకు ఆఖరి ఐటమ్ అని తెలిసిపోయిందా?’’

‘‘అవును’’ అన్నాడు కార్తికేయ.

‘‘భలే గుర్తుపట్టారే’’

★ ★ ★

కారు విమానాశ్రయంవైపు వెళుతోంది. కార్లో అనూజ్ఞ లేదు. సరాసరి ఎయిర్-పోర్ట్ కే వస్తానంది. గోవింద్ కార్తికేయతో ‘‘నాకెందుకో మీరు మరింత తెలివితేటలతో ప్రవర్తించి ఉండాలని అనిపించింది గురూజీ. చివరలో అనుమానం వచ్చి మట్టిని హారతి కర్పూరంలా జల్లి దెబ్బ కొట్టారనుకోండి. కానీ ప్రయాణం మానుకుని అంత హడావుడిగా శ్మశానానికి వచ్చిన వైనం, ఆ కంగారూ... మా అందరికీ భలే నవ్వు తెప్పించాయి’’.

కార్తికేయ ఓ క్షణం నిశ్శబ్దంగా ఉండి ‘‘నువ్వయితే ఏం చేసేవాడివి గోపాల్?’’ అని అడిగాడు.

‘‘ఆ అమ్మాయి ఈపాటికే రెండుసార్లు ఫూల్ చేసింది. ఇంకోసారి అవను. నా చెవిలో పువ్వు పెట్టొద్దని ఆ అమ్మాయికి చెప్పండి’ అని చెప్పేవాడిని’’.

‘‘ఎవరికీ?’’

‘‘ఎయిర్-పోర్ట్ ఎంక్వయిరీ లో అమ్మాయికి’’

‘‘ఒకవేళ ఆ మరణం నిజమయ్యుంటే?’’

గోపాల్ చివుక్కున తలెత్తాడు.

కార్తికేయ నెమ్మదిగా అన్నాడు. ''రెండుసార్లు చేసింది సరే. మూడోసారి కూడా చేసిందని నమ్మకం ఏమిటి?''

కార్తికేయ ఏమన్నాడో గోవింద్ కి అర్థంకాలేదు. కార్తికేయ కొనసాగించాడు. ''ఆమె నన్ను ఫూల్ చేసి నాటకం ఆడటానికి తొంభై తొమ్మిది శాతం ఛాన్సు ఉంది. నిజమే. కాని నిజమవటానికి కూడా ఒక శాతం ఛాన్సు ఉంది. దురదృష్టవశాత్తు ఆ ఒక్క శాతమే నిజమై ఆమెకేదయినా అపాయం జరిగిందనుకో. చివరి చూపుకూడా దక్కకుండా నేను మా ఊరు వెళ్ళిపోయినందుకు జీవితాంతం బాధపడకుండా ఉండగలనా? నేనో ఫూల్ ననుకుని మీరు నవ్వుకునే దానికన్నా ఆ బాధ ఎక్కువ కాదా?''

గోవింద్ గోపాల్ దిగ్భ్రాంతుడయ్యాడు. అతడు లెక్కల్లో పోస్టుగ్రాడ్యుయేట్. అయినా ఈ 'రిలెటివిటీ' గురించి జీవితంలో ఎప్పుడూ ఆలోచించలేదు. ''ఏమిటీ వ్యక్తి' అనుకున్నాడు. 'సముద్రాలు ఇతడి లోతు చూసి ఈర్ష్యపడతాయి. పర్వతాలు ఇతడి ఎత్తు చూసి సిగ్గు పడతాయి' అన్న అనూజ్ఞ మాటలు గుర్తొచ్చాయి. రవ్వంత గిల్టీగా ''మీరు మనుషుల్ని ఇంతగా నమ్మితే దెబ్బతింటారేమో?'' అన్నాడు.

''ఎన్నిసార్లు దెబ్బతిన్నా సరే. మనుషుల్ని నమ్ముతూనే ఉండాలనిపిస్తుంది గోపాల్. ఎందుకంటే సాటి మనిషి మీద అపనమ్మకంతో గెలిచిన గెలుపు కంటే, నమ్మకంతో వచ్చిన ఓటమే గొప్ప సంతృప్తినిస్తుంది. అవతలి మనిషి కన్నా మనం గొప్పవాళ్ళమని నిరూపించి వాదించి ఓడించటంకంటే, మనకేమీ నష్టం లేనప్పుడు, అవతలి వాళ్ళ తెలివితేటల్ని ఒప్పుకుంటే మాత్రం తప్పేమిటి?''

గుండెలో ఏడు రంగులున్నాయని నీటి చుక్కని స్పృశించే దాకా సూర్యకిరణానికి తెలియదు. సజ్జన సాంగత్యం లభించే వరకూ మనమెలా బ్రతుకుతున్నామో మనకు తెలీదు.

కారు విమానాశ్రయంలో ఆగింది. పావుగంట తరువాత అనూజ్ఞ పరుగెత్తుకుంటూ వచ్చింది. ''మా నాన్నగారు కూడా ఈ ఫ్లయిట్‌కే వెళ్తున్నారట. ఆయనకి కనపడకుండా రావటం ఆలస్యమైంది'' అని దగ్గర కొచ్చి రహస్యంగా ''...శ్మశానంలో ఆడిన నాటకం మా నాన్న కి తెలిసిపోయింది. ఆయన ఫైర్ అయిపోతున్నాడు. అయితే ఎందుకు ఆడానో మాత్రం తెలీదు. అంతవరకూ అదృష్టవంతులం'' అంది.

''తెలిసినా బావుండేది. కూతురికి పెళ్ళీడు వయసొచ్చేసిందని తెలుసుకునేవారు.'' అనూజ్ఞ సిగ్గుపడింది. రతీదేవే కర్పూర హారతి పట్టినట్టు ఆ సిగ్గు ఆమె మొహం మీద హారతి వెలుగైంది.

ఆ మూడ్‌లోంచి బయటకి రావటం కోసం మాట మారుస్తూ, మా వాళ్ళంతా నన్ను ఆట పట్టిస్తున్నారు మిత్రాజీ. 'నీ బాయ్ ఫ్రెండ్ ఏమిటి మరీ ఇంత మట్టిబుర్ర' అని ఎగతాళి చేస్తున్నారు'' అంది.

ఆ మాటలకి గోవింద్ గోపాల్ మొహం ఎర్రబడింది. కార్తికేయ మాత్రం చిరునవ్వుతో ఊరుకున్నాడు.

''మీకు కొద్దిగా కూడా అనుమానం రాలేదా? మీరు మరీ ఇంత...'' ఆమె మాటలు పూర్తికాకుండానే గోవింద్ గోపాల్ మరింత ఇరిటేట్ అయి ''ఇడియెట్. స్టూపిడ్'' అని అరిచాడు. ఆ ఆవేశానికి ఆమె బిత్తరపోయింది. కార్తికేయ కూడా ఆశ్చర్యపడ్డాడు. గోపాల్ తనని తాను కంట్రోల్ చేసుకుంటూ, ''ఐయామ్ సారీ'' అన్నాడు.

''అసలేం జరిగింది?'' అని అడిగింది అనూజ్ఞ అయోమయంగా.

''గొప్పవాళ్ళు సామాన్యుల్లా కనపడతారు. సామాన్యులు గొప్పవాళ్ళల్లా కనపడటానికి ప్రయత్నిస్తారు'' ఆవేశంగా అన్నాడు గోపాల్.

''ఇప్పుడదంతా ఎందుకు?'' అంటూ కర్తికేయ ఏదో అనబోతూ ఉండగా విమానం గురించి ప్రకటన వెలువడింది. ''నేను సెక్యూరిటీ టిక్కెట్టు తీసుకువస్తాను'' అని కార్తికేయ వెళ్ళిపోయాడు.

''ఏమిటి గోపాల్ ఏమైంది'' అడిగింది అనూజ్ఞ.

''పెరాబోలా అన్న పదం తెలుసా నీకు? మన ప్రవర్తన పెరాబోలా లాటిది. ఏమీ తెలియని వాడు క్రిందే ఉంటాడు. పరాకాష్ట చెందిన వ్యక్తిత్వం ఉన్నవాడు...'' అంటూ కార్తికేయ ఆలోచనా విధానం వివరించాడు.

అయితే అతను ఊహించినట్టు ఆమె విస్తుపోలేదు. ఇటువంటిదేదో ఉంటుందన్నట్టు అన్యమనస్కంగా విన్నది. ఒక్కోసారి అవతలివాళ్ళు మాట్లాడుతూనే ఉంటారు. ఇవతలివాళ్ళు తమ ఆలోచనలో తాముంటారు. అలా వింటూ, ఏదో స్ఫురించినట్టు చప్పున ''ఇప్పుడే వస్తాను'' అని అక్కణ్నుంచి వేగంగా వెళ్ళిపోయింది.

ఈసారి ఆశ్చర్యపోవటం గోపాల్ వంతయింది. ఈ లోపులో కార్తికేయ వచ్చాడు. మరో రెండు నిముషాలకి అనూజ్ఞ వచ్చింది. ఆమె చేతిలో ఓ చిన్న ప్యాకెట్ ఉంది.

''ఏమిటది?'' గోపాల్ అడిగాడు.

ఆమె కార్తికేయని చూసి నవ్వి ''వెళుతున్న మన మిత్రుడికి చిన్న జ్ఞాపకార్థపు బహుమతి.''

''అంత హడావిడిగా వెళ్ళావ్. ఏమిటి తెచ్చావేమిటి? బిస్కెట్ ప్యాకెట్టా?''

''నీలాటి రసహీన హృదయులకి అంతకన్నా గొప్ప ఆలోచనలు ఎలా వస్తాయిలే. నాకు తెలిసి ఇంత వరకూ ఏ అమ్మాయికీ, తన బాయ్-ఫ్రెండ్ కి ఇవ్వాలని తోచని ఒక బహుమతి. నువ్వు మిత్రాజీ గురించి చెపుతోంటే ఆలోచన వచ్చి వెళ్ళొచ్చాను. ఆ విషయంలో మాత్రం నీకు థ్యాంక్స్.''

''ఎంత ఖర్చు పెట్టావేమిటి?''

''చెప్పాగా. నీలాంటి రసహీనహృదయులకి అంతకన్నా ఎక్కువగా ఏం ఆలోచనలొస్తాయని.''

''మాట మాటకి నాది రసహీన హృదయం అంటున్నావ్. ఏమిటి ఋజువు?''

''మా ఇద్దర్నీ ఒంటరిగా వదిలి పెట్టకుండా నువ్వింకా ఇక్కడ ఉండటం.''

గోపాల్ గతుక్కుమని, కార్తికేయ వారిస్తున్నా, తన కారు బయట ఉందని వెళ్ళిపోయాడు.

''ఇదేం బావోలేదు.''

''ఎందుకు బావోలేదు? మా యూనివర్సిటీలో ఇది మామూలే. ప్రేమికుల్ని వంటరిగా వదిలిపెట్టటం'' చేతుల దగ్గర కుర్తా సర్దుకుంటూ అంది.

అతడో క్షణం మౌనంగా ఉండి, ''నువ్వు మా ఊరు రా అనూజ్ఞా. కళ్యాణి నిన్ను చూసి సంతోషిస్తుంది'' అన్నాడు.

''కళ్యాణి ఎవరు?''

''చెప్పాగా నా భార్య.''

అనూజ్ఞ నవ్వింది. ''నేను ఒక నాటకం ఆడినప్పుడల్లా మీరు మొగలి పొదలోంచి తీసినట్టు ఈ కథ బయటకు తీస్తూ ఉంటారా?''

అతడేదో అనబోతూ ఉంటే అనౌన్స్‌మెంట్ వినిపించింది. అనూజ్ఞ తన చేతిలో ప్యాకెట్ అందించింది.

''ఏమిటిది?''

''విమానంలో కూర్చోగానే విప్పి చూడండి. అన్నట్టు మీకు మంగోలియన్ భాష తెలుసా??

''తెలీదు ఏం?''

''నేను నిన్ను ప్రేమిస్తున్నానూ అనటానికి మంగోలియన్ భాషలో '...యెవో యెవొలై' అంటారు. వెనుకనుంచి 'ఐ లవ్ యూ' అన్నమాట. మనిద్దరి మధ్య కోడ్‌వర్డ్ uoy evol I...''.

''అనూజ్ఞా... నువ్వు అనవసరంగా–''

''ష్'' అతని చెయ్యి పట్టుకుని పక్కకు లాగుతూ ''మా నాన్న'' అని కాఫీ షాప్ వెనక్కి తీసుకు వెళ్ళింది. ఈ లోపులో రెండో అనౌన్స్‌మెంటు వినిపించింది.

''నేను వెళ్ళొస్తాను.''

''ఎంత సింపుల్‌గా అంటున్నారు. వెళ్ళొస్తాననీ...''

''మరేమనాలి?''

''వెళ్ళటం తప్పదు కాబట్టి వెళ్తున్నాను. వచ్చేవరకు నిర్జీవంగా జీవిస్తాను– అనాలి.''

అతడు కదిలిపోయాడు. తమ విషయం పక్కన పెడితే, ప్రేమని ఇంత గొప్పగా వ్యక్తీకరించే కళ చాలా తక్కువమందికి ఉంటుంది. ''నిన్ను చేసుకోబోయేది ఎవరో గానీ గొప్ప అదృష్టవంతుడు'' మనస్ఫూర్తిగా అన్నాడు. ''...ఇంత ప్రేమించే హృదయం చాలా తక్కువమందికి ఉంటుంది.''

''మీకూ ప్రేమించే హృదయం వస్తుంది. నేనిచ్చిన బహుమతి మీ దగ్గరే ఉంచుకోండి.''

''ఏమిటది?''

''విమానంలో చూడమన్నాగా'' ఆమె ఆగి నెమ్మదిగా అన్నది– ''మనిషి మరీ ఆనందంగా ఉండకుండా ఉండటం కోసం దేవుడు 'ఈ కాలం' అనేదాన్ని సృష్టించాడనుకుంటాను కదూ. చూడండి ఈ వారం రోజులు ఎంత తొందరగా గడిచిపోయాయో. ఈ దేవుళ్ళకి కలయికలు, విడిపోవటాలూ లేవు. అందుకే వారికి విడిపోవటంలో బాధ తెలీదు'' అంటూ ఆమె తలెత్తి అతడి వైపు చూసి ''ఏమిటి అలా ఆశ్చర్యంగా చూస్తున్నారు?'' అని అడిగింది.

''ఇలాంటి భావుకత్వం పైకి మాట్లాడటం అదోలా గమ్మత్తుగా ఉంది.''

''సాధారణంగా భావుకులు ఇంట్రావర్ట్ లై ఉంటారు. అందుకే భావుకత్వంతో మాట్లాడ లేరు. ఉత్తరాల్ని ఆశ్రయిస్తారు. లేదా క్యాసెట్‌లు పంపుతారు. కానీ అవన్నీ పాత పద్ధతులు. నా హృదయాన్ని ఎలా కొత్తరకంగా చెప్పాలా అని రాతంత్రా కూర్చుని వ్రాసుకుని కంఠతా పట్టాను'' అంది. 'కొత్తరకంగా' అన్న మాటని వత్తిపలుకుతూ.

''వ్హాట్'' అన్నాడు.

''అవును. భావుకత్వాన్ని ప్రకటించటానికి ఉత్తరం కన్నా 'మాట' మంచిది కదా. మనసులో అనుకున్నది ఎదురుగా నిలబడి ఎందుకు చెప్పలేనా? అని ఎక్స్‌పెరిమెంట్ చేశాను'' ధీమాగా అంది. కార్తికేయ బెదిరినట్లు కనిపించాడు. పట్టించుకోకుండా అనూజ్ఞ కొనసాగించింది. ''...రాత్రి మూడింటివరకూ వ్రాస్తూనే ఉన్నాను. ఒక్కొక్క మంచి భావం మనసులోంచి కాగితం మీదకు రావటానికి చాలా కష్టమైంది. మధ్యమధ్యలో అస్సలు వ్రాయలేక బయటకొచ్చాను. పోర్టికోలో పచార్లు చేస్తూంటే తోటలో పూలు జాలిగా చూశాయి. నీళ్ళ ఫౌంటెన్‌లోకి రాళ్ళు విసరి వెన్నెల కిరణాలని చెదరగొట్టాను. అక్వేరియంలో నీళ్ళు కదిపి చేపల్ని నిద్రలేపాను. కాలం తరుముతోంటే కలం కదపటం ఎంత కష్టమో అర్థమైంది. మొత్తంమీద ఎలాగో పూర్తి చేయగలిగాను. ఆ తరువాత దాన్ని కంఠతా పట్టాను. చెప్పనా?''

''చెప్పు'' అన్నాడు దీనంగా.

**''కళ్ళకి కాటుక అందాన్నిస్తుందంటారు. కానీ అందమైన అమ్మాయికి కాటుక ఎలా ఉండాలో కళ్ళే నిర్దేశించినట్టు మీ జ్ఞాపకం నన్ను శాసిస్తోంది. బొట్టుకి అందం నుదురు తెచ్చినట్టు – మీ స్నేహం నాలో స్త్రీత్వాన్ని నిర్దేశిస్తోంది...''**

అతడు అప్రతిభుడై చూశాడు. ఆమె చుట్టూ ఉన్న జనాన్ని కూడా పట్టించుకోకుండా అతడి కళ్ళలోనే ఉత్తరాన్ని చూసుకుంటున్నట్టు చెప్పసాగింది.

**నిదురా కలా... ఏరూ అలా... వీటిని విడదీయటం ఎలా?**
**కోల్పోయిన అనుభూతి కోసం మనసు కోటి గొంతుకలు పల్లవి పాడే సమయంలో... సృష్టి కూడా ఆగిపోయి మన ఆనందంలోని రహస్యాన్ని తొంగి చూసేట్టూ చేయాలనీ...**

**తెలిసీ తెలియని కోర్కె ఏదో... విరిసీ విరియని పువ్వులా మనసులో కదిలినప్పుడు...**

అదిగో అలా కోపంగా చూడకు. నేను ప్రస్తుతం ఎంత ప్రేమరసావిష్టురాలినై ఉన్నానంటే, నీ కోపం కూడా గుడిలో సాంధ్య దీపంలా కనిపిస్తోంది నాకు.

ఈ హృదయం – నా పిచ్చి హృదయం – ఏమయిపోయిందో ఆ జులాయితనం!

ఈ హృదయంలో ఒకప్పుడుండే అల్లరి మహానగరం – ఏమైపోయిందో ఆ సంచలనం!

కేవలం మౌనంగా ముగ్ధంగా నీ కదలికల్ని గమనిస్తూ ఉండాలన్న కోర్కె ఒక్కటే అనుక్షణం!

కొన్ని పాటల్ని కళ్ళు మూసుకునే వినాలనిపించేట్టు, కొన్ని భావాల్ని హృదయంతో హృదయానికే చెప్పాలి.

గోదార్లో రూపాయి నాణెం విసిరినట్టు మన హృదయంలో ఎవరు మునక వేస్తారో వారిపట్ల కలిగే ప్రేరణే ప్రేమంటే.

కాగితం బుగ్గ మీద కవి అక్షరం బొట్టు పెట్టినట్టు – నీ జ్ఞాపకం నా మనసుమీద పచ్చబొట్లు పొడుస్తోంది.

ఇక రేపట్నుంచీ – కళ్ళు మూస్తే కలల కలకలం– కళ్ళు తెరిస్తే నువ్వు లేని ఒంటరితనం.

వీటన్నిటికీ తోడుగా – నిద్దట్లో నన్ను తడిమే నీ రహస్యాల చిలిపితనం.

రేపట్నుంచీ మీకు రోజుకో ఉత్తరం రాస్తాను. కానీ ఏం లాభం? ఆనాడు రుక్మిణి అనుకున్నట్టు. 'ఘనుడా... భూసురుడేగెనో... నడుమ మార్గశ్రాంతుడై' అని సరీగ్గా చేరుతున్నాయో లేదో అని దిగులు పడతాను. వెనుకటి రోజుల్లో అయితే ఈ తాబేలు నడకలాటి పోస్టల్ డిపార్టుమెంట్ లేదు కాబట్టి – ప్రేమికులు ఏ మలయ మారుతంతోనో, మేఘాలతోనే రాయబారాలు పంపుకునేవారట.

జీవితం మనకి బ్యూటీ స్పాటో – మనం జీవితానికే బ్యూటీ స్పాటో కావాలంటే మీలాంటి స్నేహితుడుండాలి. ఇంకేం వ్రాయ... సారీ... ఇంకేం చెప్పను? ఇంత చెప్పాక ఇంకేమీ చెప్పలేను.

వెళ్ళిరండి మిత్రాజీ! ఒక స్వప్నం కంటిపాప మీద నిదుర లేవకముందే – ఒక కోరిక మనసులో వళ్ళు విరుచుకోకముందే – ఒక భావం కంఠంలో నుంచి వెలికి రావటానికి భాష లేక విలవిల లాడకముందే – వెళ్ళిరండి...

సడెన్‌గా ఆమె కంఠం రుద్ధమవటంతో స్వప్నం చెదిరినట్టు అతడు ఆమె వైపు చూశాడు. ఆమె చప్పున వెనుదిరిగి అక్కడినుంచి వడి కెరటంలా వేగంగా వెళ్ళిపోయింది. చెంపమీద కదిలే కన్నీటి చుక్కలో మెరిసే వెలుగు కిరణం వీడ్కోలై చెయ్యి ఊపింది.

కన్నీటి చుక్కలతో వీడ్కోలు చెప్పి ఆమె అయితే వెళ్ళిపోయింది గానీ, అతడు మాత్రం హేమంతంలో చన్నీటి స్నానం చేసిన వాడిలా వణికాడు. స్నానం చేసింది శరీరంకాదు. మనసు! వణికింది ఆనందంతోనూ విషాదంతోనూ కాదు. ఉద్విగ్నంతో!

కొన్నాళ్ళ క్రితం అతడు చేతులు జోడించి 'ఫీలింగ్' కోసం దేవుని ప్రార్థించాడు. 'ఫీలింగ్' ఎలా ఉంటుందో ఇప్పుడు కళ్ళారా చూశాడు!

అతడు చిత్రకారుడు. మెరుపుని కూడా పట్టుకోగలడు. ఆమె కళ్ళలో కదలాడిన సిన్సియర్ ఫీలింగ్‌ని పట్టుకుని ప్రచండ వాతూల హతనీప శాఖలా వణికిపోయాడు. అక్కడ తను వివాహితుడననీ ఆమెది అపోహ అనీ కాదు సమస్య. ఈ హిపోక్రటీస్ కతీతంగా ఆ కన్నీటి చుక్కలో ఒక పురాతన భావం. మెటీరియలిస్ట్ ప్రపంచానికి అందనిది. ఆ ఫీలింగ్ తాలూకు వర్జినిటీ... అదీ – అతడిని కదిపేసింది..!

హృషీకేష్ పక్క నది దాటి బ్రిడ్జి మీంచి రెండు కిలోమీటర్లు వెన్నెల్లో నడిచి అడవిలోకి వెళ్తే... ఆ హిమాలయాల మలుపులో వయ్యారంగా మెలికలు తిరుగుతూ కొండల మధ్యనుంచి వస్తూ కనబడుతుంది అలకనందా నది! శిఖరాగ్రపు మంచుమీద పడే వెన్నెల కిరణం ఆ నీటి స్వచ్ఛదనం మీద పరావర్తనం చెందటం చూస్తే... నది హోరు తప్ప అంతా నిశ్శబ్దమైన ఆ ప్రకృతిలో లీనమవుతే, ప్రకృతిలో మమేకమవటం పరవశింప జేస్తుంది. మరోవైపు మనమెంత కోల్పోతున్నామో తెలిసి వేదన కలుగుతుంది.

ప్రకృతి శాశ్వతం. మనిషి అశాశ్వతం.

ఇన్ని రకాల ఫీలింగ్స్ అతడికి ఆమె వీడ్కోలులో కనబడ్డాయి. ఆనందంలో విషాదం అంటే మామూలుగా తెలీదు దానికర్థం. ఈమని శంకరశాస్త్రి వేలికొస చెపుతుంది. ద్వారం వెంకటస్వామి నాయుడుగారి చేతి కమాను చెపుతుంది. 'భావాన్ని' అర్థం చేసుకుని 'భవాన్ని' అన్వయించుకోలేక తలవంచుకుని లోపలికి నడిచాడు. శరీరం భారమై, మనసు దుర్భరమై, ఒక మూల కుర్చీలో కూలబడ్డాడు. అప్రయత్నంగా అతడి చేతులు ఆమె ఇచ్చిన ప్యాకెట్‌ని విప్పసాగాయి.

సరిగ్గా ఆ సమయానికి తడికళ్ళతో టాయిలెట్‌లో అద్దం ముందు అనూజ్ఞ తనతో తాను మాట్లాడుకుంది. 'ఏయ్ పిచ్చిపిల్లా. వెళ్ళిపోయే వాడిని విషాదంతో పంపుతావా? ఛీరప్ మై గర్ల్. అతడిని నవ్వించు'.

క్షణంలో ఆమె మామూలు అల్లరి అమ్మాయి అయిపోయింది. సరాసరి అనౌన్సింగ్ ఛాంబర్‌లోకి వెళ్ళింది. మైకు ముందు ఒక సింధీ అమ్మాయి కూర్చుని ఉంది. ''మాడమ్. అర్జెంటుగా ప్రయాణీకుడికి ఒక విషయం చెప్పాలి. ఆయన ఇప్పుడే విమానం ఎక్కబోతున్నారు''.

''ఎవరు? ఏమిటి విషయం?''

''ఆయనకి కొడుకు పుట్టాడట. ఇప్పుడే తెలిసింది ఆ వార్త...''

''అలాటి విషయాలు చెప్పము''

''మామూలుగా అయితే చెప్పం. కానీ ఆయన భారతీయుడు కాదు. కో... రిత్‌కేయ... అని మంగోలియా నుంచి వచ్చారు. ఆయనకి ఇంగ్లీషు కూడా రాదు. మంగోలియన్ భాషలో చెప్పాలి.''.

సింధీ అమ్మాయి ఇబ్బందిగా చూసి– ''ఎలా చెప్పటం!'' అంది.

''వ్రాసుకొచ్చాను'' అంటూ కాగితం అందించింది. 'uoy evol I' అని ఉంది.

"ఎలా ఇది చెప్పటం?" అడిగింది సింధీ అమ్మాయి.

"మీరు ముందీ పేరు చెప్పండి. ఆయన వెళ్ళిపోతారు. తొందరగా" అని ఆలోచించుకోనివ్వకుండా కంగారు పెట్టింది. సరిగ్గా ఆ సమయానికి కార్తికేయ ప్యాకెట్ విప్పాడు. అంతలో మైకులోంచి "మిస్టర్ కోరిత్ – కే – యా" అని అనౌన్సర్ కంఠం వినపడింది. ఆ పిలుపుకి కార్తికేయ ఉలిక్కిపడి, నన్నేనా అన్నట్టు గోడకున్న స్పీకర్‌వైపు చూశాడు. అలా తిరగటంతో పక్కనే ఉన్న ఫాన్ తాలూకు గాలి రివ్వున కొట్టింది. చేతిలో ఉన్న నైలాన్ 'చున్నీ' ఒక పరదాలా మొహాన్ని చుట్టుకుంది. మెడచుట్టూ వేసుకునే చున్నీ – అదే ఆమె బహుమతి.

"... **ఇన్నాళ్ళూ నా గుండెల్ని కాపలా కాసిన ఈ పరదా– నా మనసులో కోర్కెని నీ దగ్గరకు చేరుస్తోంది. ఇన్నాళ్ళూ నా హృదయానికి చేరువుగా ఉన్నది, ఈ రోజు హృదయంతో పాటు నిన్ను చేరుకుంటోంది**" అన్నట్టు, అతడి నుదురునీ, చెంపల్నీ, పెదవుల్నీ, గెడ్డాన్నీ, మెడనీ స్పర్శిస్తూ– అతడి శ్వాసని ఆ పరిమళం చుట్టుముడితే–

అదే సమయానికి ఆమె మాటలు అతడిని చేరుకున్నాయి. "కార్తికేయ... యెహో యెహొలై... యెహో యెహోల్ ఐ" అన్న పదం ఆమె సర్వం నుంచి ధ్వనించి– ప్రతిధ్వనించి – ఆ విపంచి తరంగించి – అతడి హృదయాన్ని స్పృశించి – పల్లవించింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments